నేడు 'సాక్షి' ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ వెంకటేశ్వరనగర్‌లోని సత్‌జ్ఞాన్ స్కూల్‌లో 'సాక్షి' ఆధ్వర్యంలో ఈనెల 11న ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు స్కూల్ కరస్పాండెంట్ చింతల మల్లేశంయాదవ్ ఓ ప్రకటనలో తెలియజేశారు. ఈ పోటీల్లో ఉత్తమ ముగ్గులు వేసిన మహిళలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు కన్సోలేషన్ బహుమతులు ఉంటాయని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనదలిచే మహిళలు తమ వెంట రంగులు తెచ్చుకోవాలని మల్లేశంయాదవ్ కోరారు.

చిన్నారిపై వీధి కుక్కల దాడి

- మూడు రోజుల్లో ఇది రెండో ఘటన
- పట్టించుకోని సంబంధిత శాఖ అధికారులు


దాడిలో గాయపడిన బాలుడు ప్రకాష్

కుత్బుల్లాపూర్: వీధి కుక్కల దాడిలో మరో చిన్నారి గాయపడ్డాడు. రెండు రోజుల క్రితం నిజాంపేట్‌లో తండ్రి, కుమార్తెను వీధి కుక్క కరిచిన ఘటన మరువక ముందే తాజాగా జీడిమెట్ల గ్రామంలో మరో ఘటన చోటు చేసుకుంది. జీడిమెట్ల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రకాష్ (6) రెండో తరగతి చదువుతున్నాడు. బుధవారం గ్రీన్‌పార్క్ మీదుగా జీడిమెట్లలోని పాఠశాలలకు నడుచుకుంటూ వెళ్తుండగా వీధికుక్కలు బాలుడిపై దాడి చేసి కరిచాయి. ఈ ఘటనలో బాలుడి కాళ్లకు తీవ్ర గాయాలై రక్తస్రావం అయ్యింది. వెంటనే స్థానికులు దగ్గరలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లి బాలుడికి చికిత్స చేయించారు. ఇటీవల వీధి కుక్కల దాడులు పెరిగిపోవడంతో స్థానికులు బెంబేలెత్తిపోతున్నారు. విపరీతంగా పెరిగిపోయిన వీధి కుక్కల బారి నుంచి తమకు కాపాడాలని స్థానికులు వేడుకుంటున్నారు.

నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తా


ఎమ్మెల్యే వివేకానంద్‌ను సన్మానిస్తున్న కార్పొరేటర్ జగన్, బస్తీవాసులు

కుత్బుల్లాపూర్: నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. బుధవారం జగద్గిరిగుట్ట డివిజన్‌లోని షిర్డీహిల్స్, కూన మహాలక్ష్మినగర్, రాజీవ్‌గృహకల్ప, భూదేవి హిల్స్‌లలో ఎమ్మెల్యే కృతజ్ఞత యాత్ర చేపట్టగా స్థానికులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రజలు తనపై చూపుతున్న ఆదరాభిమానాలు మరువనన్నారు. మూడోసారి ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజల ఆశయాలకు అనుగుణంగా పని చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జగన్, డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు రుద్ర అశోక్, నాయకులు వేణుయాదవ్, కృష్ణాగౌడ్, సయ్యద్‌రషీద్, విఠల్ ముదిరాజ్ తదితరులు ఉన్నారు.

అధికారుల నిర్లక్ష్యం.. పగిలిపోతున్న పైప్‌లైన్లు


సుచిత్ర జీన్స్‌ఫ్యాక్టరీ సమీపంలో ఎస్‌ఎన్‌డీపీ పనుల తవ్వకాలు


పైపులైన్‌ను రంపంతో కోసేసిన దృశ్యం

చింతల్: ఎస్‌ఎన్‌డీపీ నాలా నిర్మాణ పనులు అధికారుల నిర్లక్ష్యం కారణంగా జలమండలి పైప్‌లైన్లు ఎక్కడికక్కడే తెగిపోతున్నాయి. జీడిమెట్ల డివిజన్ పరిధిలోని సుచిత్ర జీన్స్ ఫ్యాక్టరీ వద్ద బుధవారం చేపట్టిన జేసీబీ తవ్వకాలతో 150 ఎంఎం తాగునీటి పైపులైన్‌లు ధ్వంసమయ్యాయి. అప్పటికే పైప్‌లైన్ గుండా నీటి సరఫరా జరుగుతుండటంతో లీకైన నీరం అన్నారు. తమ ఇళ్ల బేస్‌మెంట్లు దెబ్బతినే ప్రమాదం పొంచి ఉందని సమీప ఇళ్లవాసుల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పలు చోట్ల పైప్‌లైన్లను రంపంతో కోసినట్లు జలమండలి అధికారుల పరిశీలనలో బయటపడింది. ఇష్టానుసారంగా పనులు నిర్వహిస్తున్న సదరు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని సమీప ఇళ్ల వాసులు కోరుతున్నారు.

తా సమీపంలోని భవనాల సెల్లార్లలోకి ప్రవేశించింది. దీంతో స్థానికులు సదరు నీటిని మోటార్ల సహాయంతో సాయంత్రం వరకు తోడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

◆ అధికారుల పర్యవేక్షణ లేకుండానే సదరు కాంట్రాక్టర్ ఎస్‌ఎన్‌డీపీ పనుల్లో భాగంగా ఇష్టానుసారంగా తవ్వకాలు చేపడుతున్నాడని

డ్రైనేజీలు పొంగుతున్నా పట్టించుకోరా.?


హెచ్‌ఎంటీ సొసైటీ ప్రధాన రోడ్డులో మ్యాన్ హోల్ నుంచి పొంగుతున్న మురుగు

రంగారెడ్డినగర్: డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నా సంబంధిత అధికారులు నిద్రమత్తు వీడటం లేదు. కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిళ్ల పరిధిలోని పలు కాలనీలు, బస్తీల్లో ఏదో ఒక చోటు నిత్యం పారుతున్న మురుగుతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. సూరారం డివిజన్ షాపూర్‌నగర్‌లోని హెచ్ఎంటీ సొసైటీలో గత నాలుగు రోజులుగా ప్రధాన రోడ్డుపై మురుగు నిండిపోతోంది. దీంతో అటుగా రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సమీపంలోని ఇళ్లవాసులు, దుకాణదారులు మురుగు కంపు భరించలేకపోతున్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి మ్యాన్‌హోళ్లలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

బాలికకు చాక్లెట్ ఇచ్చి అత్యాచారానికి యత్నం

జీడిమెట్ల: మాయ మాటలతో బాలికను నమ్మించాడు. ప్రతిరోజు పలకరించి చాక్లెట్ ఇచ్చాడు. తెలిసిన వ్యక్తిలాగా పలకరించాడు. అదునుచూసి బాలికపై అత్యాచారయత్నానికి ఒడిగట్టాడు. ఈ సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్స్‌పెక్టర్ పి.శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. చింతల్ ప్రాంతానికి చెందిన దంపతులకు కుమార్తె (13) ఉంది.

◆ బాలిక స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ పాఠశాలలో 6వ తరగతి చదువుతోంది. కొన్ని రోజుల క్రితం బాలిక ఇంట్లో శుభకార్యం జరగింది. ఫంక్షన్‌లో స్థానికంగా ఉన్న ఓ టెంట్ హౌజ్ వారు టెంట్ వేశారు. ఆ సమయంలో టెంట్ వేసిన ఓ వ్యక్తి (35) బాలికపై కన్నేశాడు. అప్పటి నుంచి బాలిక బయట కనబడినపుడు పలకరించడం చాక్లెట్స్ ఇవ్వడం చేసేవాడు. బాలిక సైతం తెలిసిన వ్యక్తిగా భావించి మాట్లాడేది.

◆ బుధవారం రాత్రి 9.30గంటలకు బాలిక ఇంటి సమీపంలో సైకిల్ తొక్కుతోంది. ఆ సమయంలో అక్కడికి వచ్చిన సదరు వ్యక్తి బాలికకు మాయమాటలు చెప్పి ఇంటికి సమీపంలోని పద్మానగర్ ఫేజ్-1లో ఉన్న టెంట్‌హౌస్ డెకరేషన్ సామాన్లు ఉంచే స్టోర్ వద్దకు బాలికను తీసుకెళ్లాడు. రాత్రి 10గంటలకు బాలిక ఇంట్లోకి రాకపోవడంతో తల్లిదండ్రులు చుట్టు పక్కల వెతికారు. బాలిక జాడ కనబడకపోవడంతో జీడిమెట్ల పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. రాత్రి 12గంటలకు బాలిక ఏడుస్తూ ఇంటివైపు రావడంతో తల్లిదండ్రులు ఎక్కడకు వెళ్లావని అడిగారు.

◆ బాలిక ఏడుస్తూ జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు తెలిపింది. తల్లిదండ్రులు బాలికను తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. సదరు వ్యక్తిపై పోక్సోతో పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అత్యాచారయత్నానికి పాల్పడిన వ్యక్తి ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

భారత న్యాయ సంహిత చట్టాన్ని రద్దు చేయాలి

బాలానగర్: బాలానగర్‌లోని ఐడీపీఎల్ చౌరస్తాలో సీఐటీయూ ఆధ్వర్యంలో భారత న్యాయ సంహిత చట్టాన్ని రద్దు చేయాలని ట్రక్, ప్రైవేట్ బస్సుల డ్రైవర్లు స్వచ్ఛందంగా డ్రైవర్స్ బంద్‌లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మేడ్చల్, మల్కాజ్‌గిరి జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ పాల్గొని ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీల ఎంపీలను పార్లమెంట్ నుంచి సస్పెండ్ చేసి అడ్డదారిలో డ్రైవర్లను బతికి ఉండగానే చనిపోయినట్లుగా ఉండే చట్టం తెచ్చారని పేర్కొన్నారు.

◆ ఈ చట్టం ప్రకారం ప్రమాదాలు జరిగినప్పుడు డ్రైవర్లకు పదేళ్ల జైలు శిక్ష, రూ.7లక్షల నష్టపరిహారం ఇచ్చేలా చట్టం తెచ్చి డ్రైవర్లను పనిచేయకుండా చూస్తోందని అన్నారు.

సంక్రాంతికి ఊరెళ్తున్నారా.. జాగ్రత్త!

కూకట్‌పల్లి ఏసీపీ పెద్ది శివభాస్కర్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ పెద్ది శివభాస్కర్

నిజాంపేట్: సంక్రాంతి సెలవులకు సొంతూళ్లకు వెళ్లేవారు అప్రమత్తంగా ఉండాలని.. తాళాలు వేసి ఉన్న ఇళ్లల్లో దొంగతనాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కూకట్‌పల్లి ఏసీపీ పెద్ది శివభాస్కర్ అన్నారు. బుధవారం బాచుపల్లి పోలీస్‌స్టేషన్‌లో సీఐ ఉపేంద్రరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏసీపీ పండుగకు ఊరేళ్లే వారికి పలు సూచనలు చేశారు. మీకు నమ్మకమైన ఇరుగు పొరుగు వాళ్లకు మీరు ఇంట్లో లేని సమయంలో మీ ఇంటిని గమనిస్తూ ఉండమని చెప్పాలన్నారు. విలువైన వస్తువులను స్కూటర్ డిక్కీల్లో, కార్లలో భద్రపరచవద్దని కోరారు. ద్విచక్రవాహనాలు, కారులను ఇంటి ఆవరణలోనే పార్కింగ్ చేయాలన్నారు. బీరువా తాళాలను ఇంట్లో ఉంచకుండా తమతో పాటే తీసుకెళ్లాలన్నారు.

సాధ్యమైనంత వరకు వాచ్‌మెన్‌ను నియమించుకోవాలి..

ఇంటికి వేసిన తాళం కనబడకుండా డోర్ సరిగా వేయాలన్నారు. ఇంట్లో ఏదో ఒక గదిలో లైటు వేసి ఉంచాలన్నారు. మీరు ఇంట్లో లేనప్పుడు ఇంటి ముందు చెత్తాచెదారం, పేపర్లు, పాలప్యాకెట్లు జమ కాకుండా జాగ్రత్త పడాలని సూచించారు. పని మనుషులు ఉంటే రోజూ వాకిలి ఊడ్చమని చెప్పాలన్నారు. విలువైన వస్తువుల సమాచారాన్ని, వ్యక్తిగత ఆర్థిక విషయాలను ఇతరులకు చెప్పకూడదన్నారు. సాధ్యమైనంత వరకు వాచ్ మెన్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

నగలు, నగదును బ్యాంక్ లాకర్లలో భద్రపరచుకోవాలి..

ఇంట్లో బంగారు నగలు, నగదు ఉంటే వాటిని బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవడం క్షేమమన్నారు. ఇంట్లో టైమర్‌తో కూడిన లైట్లను అమర్చుకోవాలని సూచించారు. ఇంటి మెయిన్‌డోర్‌కు సెంట్రల్ లాకింగ్ సిస్టమ్ ఏర్పాటు చేసుకుంటే సురక్షితమని తెలిపారు. హోమ్ సెక్యూరిటీ సిస్టం ద్వారా మొబైల్ నుంచే మీ ఇంటిని ఎక్కడి నుంచైనా గమనించవచ్చొన్నారు.

మోషన్ సెన్సార్ లైట్లను ఉపయోగించాలి..

సొంత ఇల్లు అయినట్లయితే ఇంటి ప్రధాన ద్వారానికి గ్రిల్స్ అమర్చుకోవడం ద్వారా రెండంచెల భద్రతనిస్తుందన్నారు. ఇంటి బయట మోషన్ సెన్సర్ లైట్లను ఉపయోగించాలన్నారు. ఇవి చీకటి ఉన్నప్పుడు మాత్రమే పని చేస్తాయన్నారు. బ్యాగుల్లో బంగారు నగలు, డబ్బు పెట్టుకొని ప్రయాణం చేస్తున్నప్పుడు జాగ్రత్త పడాలన్నారు.

అనుమానిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు తెలపాలి..

ప్రజలు తమ ప్రాంతంలో గస్తీ ఏర్పాటుకు సహకరించాలని కోరారు. పోలీసు స్టేషన్ నంబర్, వీధుల్లో వచ్చే బీట్ కానిస్టేబుల్ నంబర్ దగ్గర పెట్టుకోవాలని సూచించారు. ప్రజలు పోలీసులకు సహకరిస్తే చోరీలను నియంత్రించడం చాలా సులభమని అన్నారు. అనుమానిత వ్యక్తుల కదలికలను గమనించి, పోలీసులకు సమాచారం ఇవ్వాలని, ఇళ్లకు తాళాలు వేసి ఊర్లకు వెళ్లేటప్పుడు చుట్టు పక్కల వారికి లేదా స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని ఏసీపీ సూచించారు.

ఊరెళ్తున్న విషయం సోషల్ మీడియాలో తెలపొద్దు..

కాలనీ అసోసియేషన్లు కమిటీలు వేసుకొని వాచ్‌మెన్లను, సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. సోషల్ మీడియాలో మీరు బయటికి వెళ్లే విషయాన్ని ఇతరులకు షేర్ చేయడం మంచిది కాదన్నారు. దూర ప్రాంతాలకు వెళ్లేవారు తమ ఇంటి చిరునామా, ఫోన్ నంబర్‌ను సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులకు తెలపాలన్నారు. మీ ప్రాంతాల్లో అనుమానాస్పద, కొత్త వ్యక్తుల కదలికలపై 100 డయల్ /సైబరాబాద్ పోలీసు వాట్సాప్ నంబర్ 94906 17444కు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు రమేష్, యాదగిరి, మహేష్‌గౌడ్, సంధ్య తదితరులు పాల్గన్నారు.

దీపాదాస్ మున్షీకి శుభాకాంక్షలు



దుండిగల్: తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్‌గా నియమితులైన దీపాదాస్ మున్షీని బుధవారం టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెను శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

దుండిగల్: రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందిన సంఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. డీ-పోచంపల్లి రాజరాజేశ్వర కాలనీకి చెందిన మంగలి కృష్ణ(60) వ్యవసాయ పనులు చేస్తున్నాడు. కాగా మంగళవారం సాయంత్రం తన బైక్‌పై దుండిగల్ ఔటర్ రింగ్ రోడ్డు నుంచి గండిమైసమ్మ చౌరస్తా వైపు వస్తున్నాడు. ఈ క్రమంలో సారెగూడెం ఉజ్వల రెస్టారెంట్ సమీపంలో వెనుక నుంచి వచ్చిన లారీ బైక్‌ను ఢీ కొట్టింది. లారీ చక్రాలు అతడిపై నుంచి వెళ్లింది. తీవ్ర గాయాలతో కొట్టుమిట్టాడుతున్న కృష్ణను సూరారంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కృష్ణ అదే రోజు రాత్రి మృతి చెందాడు. మృతుడి కుమారుడు వెంకటేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ మురళీకృష్ణను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

మతిస్థిమితం సరిగా లేని మహిళ అదృశ్యం

జీడిమెట్ల: మతిస్థిమితం లేని ఓ మహిళ అదృశ్యమైన ఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై హరీష్ తెలిపిన వివరాల ప్రకారం.. సుభాష్‌నగర్ గంపల బస్తీలో నివాసముండే దేవి(35)కి కొంత కాలంగా మానసిక స్థితి సరిగా లేకపోవడంతో ఇంటి వద్దనే ఉంటున్నారు. ఈనెల 1వ తేదీన దేవి ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లింది. కుటుంబీకులు అప్పటి నుంచి పరిసర ప్రాంతాలు, బంధువుల వద్ద వెతికిన ఆచూకీ లభించలేదు. గతంలో కూడా ఇంటి నుంచి బయటకు వెళ్లి మూడు రోజుల తర్వాత తిరిగొచ్చింది. ఈసారి కూడా అలాగే వస్తుందని అనుకున్నా రాలేదు. దీంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యం


రాగవి (ఫైల్)

జీడిమెట్ల: ఓ యువతి రూ.30 వేలు తీసుకుని ఇంటి నుంచి వెళ్లిపోయిన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై నాయుడు వివరాల ప్రకారం.. చింతల్ మాణిక్యనగర్‌కు చెందిన విశ్వలింగం కుమార్తె రాగవి(18) ఇంటి వద్దనే ఉంటుంది. మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూలేని సమయంలో రాగవి ఇంట్లో ఉన్న రూ.30వేలు తీసుకుని ఇంటి నుంచి వెళ్లి పోయింది. రాగవి కోసం కుటుంబ సభ్యులు చుట్టు పక్కల వెతికినా ప్రయోజనం లేకపోవడంతో రాగవి సోదరుడు సతీష్ బుధవారం జీడిమెట్ల పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా


కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

దుండిగల్: స్థానికంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించే విధంగా చేస్తామని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు, సంక్షేమ సంఘాల సభ్యులు బుధవారం రాజును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తమ సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రాలు అందజేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన శంభీపూర్ రాజు ఆయా సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

కేలండర్ల ఆవిష్కరణ..

గండిమైసమ్మలోని జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు నియోజకవర్గ మున్నూరు కాపు సంఘం నూతన సంవత్సరం కేలండర్‌ను ఆవిష్కరించారు. అదే విధంగా హెచ్ఎంటీ ఎంప్లాయీస్ కో-ఆపరేటివ్ హౌసింగ్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ డైరీ, బీఆర్‌ఎస్వీ మేడ్చల్ జిల్లా కేలండర్లను ఆవిష్కరించారు.

సత్తాచాటిన బాచుపల్లి జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు

హిందీ వ్యాస రచన, క్విజ్ పోటీల్లో అవార్డుల పంట



షేక్ హసీనా, ఖుషీకుమారికు అవార్డులు అందజేస్తున్న విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వెంకటేశం, ఇంటర్ బోర్డు సెక్రటరీ శృతి ఓజా

నిజాంపేట్: ప్రపంచ హిందీ దినోత్సవాన్ని పురస్కరించుకుని కోఠి గొలిగూడలోని వివేకావర్ధిని పోస్ట్ గ్రాడ్యుయేట్ కళాశాలలో 'హిందీ హై హమ్'విశ్వ మైత్రి మంచ్ ఆధ్వర్యంలో బుధవారం పోటీలు నిర్వహించారు. బాచుపల్లి జడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన విద్యార్థులు వ్యాస రచన, క్విజ్ పోటీల్లో ప్రతిభ కనబరిచారు. పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న షేక్ హసీనాకు స్పీచ్‌లో ప్రథమ బహుమతి, ఎస్సే రైటింగ్, క్విజ్‌లలో ద్వితీయ బహుమతి, ఖుషీకుమారికి క్విజ్‌లో ప్రథమ బహుమతి, వ్యాస రచనలో మూడో బహుమతి లభించింది. ఈ సందర్భంగా రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, ఇంటర్మీడియేట్ బోర్డు సెక్రటరీ శృతి ఓజాలు వారికి అవార్డులతో ప్రశంస పత్రాలను అందజేశారు. హిందీ మాధ్యమంలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన


ట్రాఫిక్ అవగాహన కార్యక్రమానికి హాజరైన ఏసీపీ వెంకట్‌రెడ్డి

కుత్బుల్లాపూర్: కొంపల్లిలోని ఇండిక్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో బుధవారం ఆల్వాల్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులకు ట్రాఫిక్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రధాన సర్కిళ్లని ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద పాదచారులకు సంబంధించి గ్రీన్ లైట్ ఉన్నపుడే రోడ్డు దాటాలన్నారు. ఎప్పుడు కుడి వైపునే నడవాలని సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులు ద్విచక్ర వాహనాలు నడిపే సమయంలో తప్పకుండా హెల్మెట్‌లు ధరించేలా అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ నాగేశ్వరరావు, సిబ్బంది తదితులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ ఎంఎన్‌రెడ్డినగర్ ఫేజ్-1లోని శ్రీకాశీవిశ్వేశ్వర ఆలయ వార్షికోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం ఆలయ ప్రాంగణంలో శివపార్వతుల కల్యాణం, చండీహోమం, భగవద్గీత సత్సంగ్ సేవా మండలి ఆధ్వర్యంలో భజనలు నిర్వహించారు. అర్చకులు మాణిక్యశర్మ, శ్రీనాథశర్మ శాస్త్రోక్తంగా స్వామివారి కల్యాణాన్ని జరిపించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.





నేటి నుంచి ఆర్టీసీ సంక్రాంతి ప్రత్యేక సర్వీసులు

మూసాపేట: ఆర్టీసీ సంక్రాంతి ప్రత్యేక సర్వీసులను గురువారం నుంచి నడిపిస్తున్నట్లు డిప్యూటీ ఆర్ఎం కవిత తెలిపారు. జగద్గిరిగుట్ట బస్‌స్టాప్ నుంచి హన్మకొండ, వరంగల్ సెక్టార్ వనపర్తికి, బీరంగూడ, లింగంపల్లి, చందానగర్, కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాలైన కాకినాడ, విజయవాడ, అమలాపురం, రాజమండ్రి, అనంతపురానికి ప్రత్యేక బస్సులు నడుపుతామని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ సరిహద్దు వరకు మహిళలకు పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మాత్రమే ఉచిత ప్రయాణం ఉంటుందన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

కుత్బుల్లాపూర్: విద్యుత్ ఫీడర్ల నిర్వహణ, లైన్ల రీకండక్టరింగ్ పనుల నేపథ్యంలో గురువారం విద్యుత్ సరఫరాలో ఆటంకం కలుగనుందని పేట్‌బషీరాబాద్ ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. జీడిమెట్ల ఫీడర్ పరిధిలోని జీడిమెట్ల గ్రామం, గ్రీన్ పార్కు, భీమా ప్రైడ్, మెయిన్ రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఆచార్య గోనానాయక్‌కు సత్కారం

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ తెలుగు విభాగంలో అధ్యాపకులుగా పనిచేస్తున్న ఆచార్య గోనానాయక్‌కు బుధవారం హెచ్‌సీయూలో సత్కరించారు. హెచ్‌సీయూలోని తెలుగు విభాగంలో ఆయనను తెలుగు శాఖ అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఏపీలో తెలుగు బాషా సేవ జీవిత సాఫల్య పురస్కారాన్ని అందుకోవడం పట్ల పలువురు ఆచార్యులు ఆయనను అభినందించారు. శాలువాతో సత్కరించి ఆయన పొందిన పురస్కారాన్ని అందించారు. హెచ్‌సీయూ ప్రొఫెసర్లు పిల్లలమర్రిరాములు, పవన్‌కుమార్, డి విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికల రివ్యూ మీటింగ్


రివ్యూ మీటింగ్‌లో సీఎం రేవంత్‌రెడ్డితో కొలన్ హన్మంతరెడ్డి, నాయకులు

కుత్బుల్లాపూర్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా రివ్యూ మీటింగ్ జరిగింది. ఈ మీటింగ్‌కు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జ్ కొలన్ హన్మంతరెడ్డి ఆధ్వర్యంలో పలువురు నేతలు హాజరయ్యారు. మరో రెండు నెలల్లో జరుగనున్న ఎన్నికలకు చేపట్టాల్సిన కార్యాచరణ, అభ్యర్థి విజయానికి ఇప్పటి నుంచే బూత్‌స్థాయి నుంచి ప్రచారం తదితర అంశాలపై చర్చించినట్లు తెలుస్తోంది.

ఎవరైనా పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేయాలి

కూకట్‌పల్లి బీజేపీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు

కూకట్‌పల్లి: బీజేపీ పార్టీ విలువలతో కూడిన పార్టీ అని.. ఏ స్థాయి వారైనా పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేయాల్సిందేనని కూకట్‌పల్లి అసెంబ్లీ బీజేపీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు పేర్కొన్నారు. బుధవారం మేడ్చల్ అర్బన్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు హరీష్‌రెడ్డి, పలువురు నేతలతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశాన్ని కాంతారావు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా కాంతారావు మాట్లాడుతూ.. మల్కాజ్‌గిరి పార్లమెంట్ పరిధిలోని బీజేపీ నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను అధిష్టానం తప్పకుండా పరిగణనలోకి తీసుకుంటుందన్నారు. ఇలా టికెట్ విషయంలో ఊహాగానాలతో పార్టీని తప్పుపడుతూ మీడియా సమావేశాలు ఏర్పాటు చేసి బహిరంగంగా చర్చించటం పార్టీ సిద్ధాంతాలకు వ్యతిరేకమని ఆయన మండిపడ్డారు. జిల్లాకు అధ్యక్ష బాధ్యత వహిస్తున్న వారికి ఇటువంటి కనీస సూత్రాలు తెలియకపోవటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ విషయాలను అధిష్టానం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని సేవా కార్యక్రమాలు

సుభాష్‌నగర్: స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని ఈనెల 12న శ్రీగాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో సీఎంఆర్ ఆస్పత్రి కండ్లకోయ సౌజన్యంతో ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం, రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు గోగులపాటి కృష్ణమోహన్ తెలిపారు. సూరారం కాలనీ లూయీ బ్రెయిలీ భవన్‌లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిబిరం కొనసాగుతుందన్నారు. యువతీ యువకులు అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేయాలన్నారు. ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న వారికి అవసరమైతే శస్త్ర చికిత్సలు కూడా ఉచితంగా చేయిస్తామని తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం...

రంగారెడ్డినగర్: స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని ఈనెల 12న లయన్స్‌క్లబ్ ఆఫ్ జీడిమెట్ల, మల్లారెడ్డి ఆస్పత్రి సౌజన్యంతో రక్తదాన శిబిరం, ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించనున్నట్లు స్వామి వివేకానంద యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు జల్దా లక్ష్మీనాథ్ ఓ ప్రకటనలో తెలియజేశారు. గాంధీనగర్‌లోని మహాత్మాగాంధీ కమ్యూనిటీ హాల్‌లో ఉదయం 9గంటల నుంచి మధ్యహ్నం 1.30 గంటల వరకు శిబిరాలు కొనసాగుతాయని తెలిపారు. వైద్య శిబిరంలో కీళ్ల నొప్పులు, కార్డియాక్, దంత, డయాబెటిక్ వైద్యులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రక్తదాన శిబిరంలో యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన కోరారు. ఇతర వివరాలకు ఫోన్ నం.98660 84238/99899 88277లో సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

పాఠశాలలో సంక్రాంతి సంబురాలు


నారాయణ స్కూల్‌లో చిన్నారులకు భోగి పండ్లు వేస్తున్న దృశ్యం

నిజాంపేట్: అడ్డగుట్ట నారాయణ బ్రాంచ్ పాఠశాలలో బుధవారం సంక్రాంతి వేడుకలు అంబరానంటాయి. కేపీహెచ్‌బీ పాఠశాలల జోన్ ఏజీఎం వైజయంతి, శ్రీలక్ష్మిలు ముఖ్యఅతిథులుగా హాజరైన వేడుకలను ప్రారంభించారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ చిన్నారులకు భోగి పండ్లు వేయించడం, బొమ్మల కొలువులు, భోగి మంటలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. మన సంప్రదాయాలపై అవగాహన కల్పించేందుకు ఈ ఉత్సవాలు నిర్వహించినట్లు వైజయంతి తెలిపారు.

అసంపూర్తి పనులతో ఇబ్బందులు


గుంతలమయంగా మారిన గిరినగర్ రోడ్డు

రంగారెడ్డినగర్: అసంపూర్తి పనులు రాకపోకలకు ఇబ్బందికరంగా మారాయి. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని గిరినగర్‌లో ఇటీవల భూగర్భ డ్రైనేజీ లైన్ పనులు పూర్తి చేశారు. అయితే సదరు కాంట్రాక్టర్ పనుల సందర్భంగా తీసిన గోతులను తూతూ మంత్రంగా పూడ్చి చేతులు దులుపుకున్నారు. మ్యాన్‌హోళ్ల నిర్మించిన ప్రాంతాల్లో మట్టిని సరిగా నింపకపోవడంతో గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ఈ రోడ్డు గుండా రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డులో మట్టిని నింపి గుంతలు లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.